అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 27 ఆగష్టు 2024 పేజీలు : 04

### వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తూ

# తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ**



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



**శింగనమల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మన టిడిపి యాప్ ద్వారా తెలుగుదేశం పార్టీ కంటెంట్‌ను ప్రజలకు విస్తృత స్థాయిలో షేర్ చేసి టాప్ పర్ఫార్మెన్స్‌గా నిలిచినందుకు మన టిడిపి సభ్యులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం సన్మానించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారాలోకేష్ పంపిన అభినందన లేఖను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎం.హర్షవర్ధన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ చేపట్టిన యువగళం మొదలు, గత ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించే వరకు అనేక రకాలుగా పార్టీకి, నాకు అండగా నిలిచిన మీవంటి కార్యకర్తల రుణం ఏమి ఇచ్చినా తీర్చుకోలే మని, నాటి ప్రభుత్వం ఎన్నో విధాలుగా మిమ్మల్ని కట్టడిచేయాలని చూసినా, చివరకు కేసులు పెట్టినా లెక్క చేయకుండా నిజాన్ని నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన మీ స్ఫూర్తి అభినందనీయ మన్నారు. మీ నిబద్ధతను కష్టాన్ని పార్టీ ఎప్పటికీ గుర్తించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బండారు లీలావతి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, అనంత పురం పార్లమెంట్ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు ఎం.వెంకటప్ప, ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న బండారు లీలావతి, దండు శ్రీనివాసులు



# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కదిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త**

శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో కృష్ణాష్టమి జన్మదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని షిర్డిసాయి పాఠశాలలో విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పసుపులేటి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణుని, బలరాముడు, రాధలు, గోపికమ్మల వేషధారణలను గావించి పలు నృత్యాలు చేశారు. రాధ్యాకృష్ణ పాటలకు పిల్లలు నృత్యం చేశారు. రకరకాల కృష్ణుని పాటలకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అలరించారు. చివరగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించి గోపికలు తాడులాగు కృష్ణుడు ఉట్టికొట్టే కార్యక్రమం అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వశిష్ట పాఠశాలలో..**

ఓడి చెరువు మండల కేంద్రంలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ పిట్ట శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు శ్రీకృష్ణుని, గోపికమ్మల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కృష్ణుని అలంకరణలో చిన్నారులు



నృత్యం చేస్తున్న వశిష్ట పాఠశాల విద్యార్థులు

# టమోటా మార్కెట్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



టమోటా వ్యాపారస్తునితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 26 ప్రభాతవార్త**

అనంతపురం పరిధిలోని కక్కలపల్లి వద్ద వున్న టమోటా మండి మార్కెట్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడి మార్కెట్‌కు టమోటా ఎంత వస్తుంది, ఇక్కడి నుండి ఎక్కడెక్కడికి పంపిస్తారు. ఒక్కో బాక్స్ ఎంత ధరకు వెళుతుంది. ధరలు, ఎంత కమీషన్ తీసుకుంటారు, తదితర వివరాలను జెసి అడిగి తెలుసుకున్నారు. టమోటా నో సేల్ పడేందుకు కారణమేమిటి, తదితర వివరాలను ఆరా తీశారు. వర్షాల వల్ల మచ్చలు రావడంతో పంట కొనుగోలు చేయలేదని వ్యాపారులు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ టమోటాను రోడ్లపై పడవేయరాదని దగ్గరలో వున్న డంపింగ్‌యార్డు వద్ద పడేయాలని, వీలైతే పశువులు, గొర్రెలకు ఆహారంగా అందించాలని వృధాగా పడవేయరాదన్నారు. నాణ్యమైన పంటకు సంబంధించి రైతులకు మంచి ధరలు అందించేలా చూడాలని, కమీషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, మార్కెట్ సెక్రటరీ రాంప్రసాద్‌రావు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు



ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న అంబికా లక్ష్మినారాయణ, తన తనయుడు



**అనంతపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త బ్యూరో**

జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ని సోమవారం అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, ఆయన తనయుడు వికసిత్ మర్యాద పూర్వకంగా స్తానిక పోలీస్ అతిథి గృహంలో కలిసి పూల మొక్కను అందజేశారు.

# అనంతపురంలో బిసిసిఐ దులీఫ్ ట్రోఫీ

**అనంతపురం క్లాక్‌టవర్,అగస్టు 26,ప్రభాతవార్త**

అనంతపురం డిస్ట్రిక్ అసోసియోషన్ దులీఫ్ ట్రోఫీని అనంతపురం క్రీడామైదానంలో సెప్టెంబర్ 5 నుండి 22 వరకు నిర్వహిస్తున్నందున క్యూరేటర్ సుమధర్ పింగ్ సదంర్శించారు. దులీఫ్ ట్రోఫీ మ్యాచ్‌ల కోసం పిచ్‌లను సిద్ధం చేయడానికి మధ్యప్రదేశ్ ఇండోర్ నుండి క్యూరేటర్ సుమందర్ సింగ్‌ను బిసిసిఐ నియమించింది. అతను సోమవారం పిచ్‌లను పర్యవేక్షించి, ఏసిఏ క్యూరేటర్లు కృష్ణ, బాలరాజులకు సూచనలు ఇచ్చారు. మొట్ట మోదటి సారి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుంది. అనంతపురం క్రికెట్ చరిత్రలో స్టార్ స్పోర్ట్స్‌లో టెలికాస్ట్ చేయలేదు. బిసిసిఐ చోరవ తీసుకోని అనంతపురం క్రికెట్ గ్రౌండ్(బ్రాండ్ కాస్టింగ్ రూమ్) వీడియో స్టాడ్స్‌లో అవసరమైన ఏర్పాట్లను చేయనుంది. టికెట్లు, పాస్‌లు జారీ చేయబడతాయి. ప్రతి ఒక్కరికి పాస్‌తో ఉచిత ప్రవేశం ఇస్తున్నాము. ప్రభుత్వ యంత్రాంగం, మాజీ క్రికెటర్లు, క్రికెట్ ప్రేమికులు, ప్రజలు అనంతపురంలో జరిగే టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరుతున్నాము. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్, కలెక్టర్,. ఆర్గనైజింగ్ కమిటీ కో చైర్మన్ లర్డ్ ప్రకాష్ రెడ్డి అధ్యక్షులు,. ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ సయ్యద్ సాబుద్దీన్, మాజీ క్రికెటర్, అర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కె.మధు ఆచారి, కార్యదర్శి ఏడీసీఏ, సభ్యులు పి.సాయి క్రిష్ణ, డైరెక్టర్ ఆర్డిటీ, పి.శ్రీనాథ్ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఏడీసీఏ, పి.మల్లికార్జున, మాజీ ప్రసిడెంట్ ఏడీసీఏ, ఏజేపి తీర్థ, ఏడీసీఏ మాజీ కార్యదర్శి, జొన్న జయప్రకాస్ మాజీ వైస్ ప్రసిడెంట్ ఏడీసీఏ, ఏ.యుగేంధర్ రెడ్డి, క్రికెట్ కోచ్ విరిని సభ్యులుగా నియమించారు. మ్యాచ్‌ల కోసం గ్రౌండ్ సిద్దమవుతుంది.





పిచ్‌లను పరిశీలిస్తున్న దృశం

# నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 26 ప్రభాతవార్త**

తాడిపత్రి డిపోలో ఏపిఎస్ ఆర్‌టిసి నూతన సూపర్ డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను సోమవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా పూజల్లో పాల్గొని అనంతరం నూతన బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మాట్లా డుతూ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అలాగే బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా వుండేలా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శంకర్, ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బంది, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

# బి.సి. హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య





మృతి చెందిన తేజ, మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**అనంతపురం న్యూటౌన్, అగస్టు 26, ప్రభాతవార్త**

నగరంలోని రాంనగర్‌లో ఉన్న బి.సి. బాలుర కాలేజ్ హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తేజ (16) అనే విద్యార్థి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పాలవాయి గ్రామానికి చెందిన రాములమ్మ, లింగమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు తేజ పదో తరగతి పూర్తి చేసుకొని ఈ ఏడాది ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాడు. రాంనగర్‌లోని బిసి బాలుర కాలేజ్ వసతి గృహం నందు ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ సోమవారం సాయంత్రం బాత్రూంలో తువాలుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వసతి గృహానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిణి, అనంతపురం డిఎస్పీ ప్రతాప్‌కుమార్‌లు ఆసుపత్రి చేరుకొని బాలుని మృతిదేహాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని బిసి వెల్ఫేర్ డిడి బిసి వెల్ఫేర్ మినిష్టర్, డైరెక్టర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మృతి చెందిన విద్యార్థి సోమవారం మధ్యాహ్నం హాస్టల్ సిబ్బంది ఫోన్‌లో వారి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు తెలిసింది. విద్యార్థి ఒక కాలు మీద ఒక ఫోన్ నెంబర్ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

**హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం**

అనంతపురం రాంనగర్‌లో ఉన్న బిసి బాలుర కాలేజ్ హాస్టల్ వార్డన్ ఈరన్న సోమవారం సాయంత్రం హాస్టల్ విధులకు వెళ్ళకుండా ఎబిసిడబ్ల్యూఓ అనుమతి లేకుండా ఇస్కాన్ టెంపుల్‌కు మరో ఇద్దరు మహిళా వార్డెన్లతో కలిసి వెళ్లారు. ఈయన హాస్టల్ ఉండి ఉంటే ఈ ఘటన జరిగేది కాదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

### ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వ్యక్తిపై

# ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్

**కదిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త**

మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూమి కబ్జా చేసిన ఇద్దరిపై ల్యాండ్ గ్రాబింగ్‌యాక్ట్ అమలు చేసి ఆక్రమణకు గురైన స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని పట్టణ సీఐ డివి నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ తెలిపిన వివరాల మేరకు కదిరి మున్సిపల్ పరిధిలోని కదిరి రెవెన్యూ పొలం, హిందూపురం రోడ్, సింహకోట పక్కనే సర్వే నెంబర్ 536లో నాలుగు సెంట్ల ప్రభుత్వస్థలాన్ని కదిరి టౌన్ ముర్తిపల్లికి చెందిన మాన్యంరెడ్డప్ప, జొన్న వీధికి చెందిన గూడూరు హరినాథ్‌లు కబ్జా చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడంతోపాటు మున్సిపల్ అధికారులు కబ్జాకు గురైన స్థలంలో ఆక్రమణలు తొలగిస్తుండగా పై ఇరువురు మున్సిపల్ అధికారులకు, కార్మికులకు నానా దుర్భాషలాడటంతోపాటు వీరి విధులకు ఆటంకం కలిగించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వస్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు పత్నవని హెచ్చరించారు. పై ఇరువురు గతంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు ఉండగా వీరిపై రౌడీ షీట్ కూడా ఓపెన్ చేసినట్లు సిఐ తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడకుండా దూరంగా ఉండాలని పోలీసులు పదేపదే హెచ్చరించినా, కౌన్సిలింగ్‌లు నిర్వహించిన మార్పు రాలేదన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కచ్చితంగా కేసులు నమోదు చేయడంతోపాటు నాన్‌బెయిలబుల్ కేసులు సైతం చేస్తామని హెచ్చరించారు.

పురం ఎంపి పార్థసారధిని సన్మానించిన ఏఎన్‌కె కళాశాల యాజమాన్యం 3

పివికెకె ఐటిలో 6 రోజుల ఎఫ్‌డిపి శిక్షణా కార్యక్రమం ప్రారంభం 4

# యువత కోసం మరో కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం టౌన్, ఆగస్టు 26 ప్రభాతవార్త


కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

యువతకి స్వయం ఉపాధి కోసం కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు చేస్తున్న గొప్ప కార్యక్రమం. ఎస్ఆర్సి ట్రస్ట్, అభయ ఫౌండేషన్ వారి సయుంక్త నిర్వహణలో ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు, డ్రైవింగ్, టైలరింగ్, మెహందీ, బ్యూటీషియన్, మొబైల్ రిపేర్ వంటి శిక్షణ తరగతులు యువత కోసం క ళ్యాణదుర్గం నియోజకవర్గం మార్కెట్ యార్డ్‌లో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించిన అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సిఎస్ బాలచంద్ర సుంకు, బాలాజీ, తెలుగుదేశం పార్టీ మాజీ మున్సిపల్ చైర్మన్ వైపి రమేష్ టౌన్ కన్వీనర్ సర్మాస్ వలి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రహీం కార్యక్రమంలో పాల్గొన్నవారు క్లస్టర్ ఇన్‌చార్జ్ మురళీ, మైనార్టీ నాయకుడు శామీర్, ఆకుల రెహమాన్, సునీల్‌కుమార్, బసవరాజు, పవన్ యాదవ్, ప్రకాష్, లోర వెంకటేషులు, ఎర్రగుడి వెంకటేష్, ప్రకాష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## జనసేనాపార్టీలోకి నాగిరెడ్డిపల్లి యువకులు

బ్రహ్మసముద్రం అగస్ట్ 26 ప్రభాతవార్త,


పార్టీకండువా వేస్తున్న దృశ్యం

మండంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు కళ్యాణదుర్గం జనసేనా ఇన్‌ఛార్జ్ బాల్యం రాజేష్, మండల జనసేనా అధ్యక్షుడు రాయుడు అధ్వర్యంలో జనసేనా పార్టీలోకి చేరారు. మండంలోని నాగిరెడ్డిపల్లిలో సెప్టెంబర్ 02 జనసేనా అధినేత పవన్‌కళ్యాణ్‌గారి జన్మదినవేడుకలకు సంభందించి నాగిరెడ్డిపల్లిలో సమావేశం నిర్వహించిన కార్యక్రమంలో అదే గ్రామానికి చెందిన 30మంది యువకులు జనసేనాపార్టీ సిద్దంతాలునచ్చిన యువకులు పార్టీలోని రావడం సంతోషంగావుందని జనసేనా మండల,తాలూకా ఇన్‌చార్జ్‌లు అన్నారు.ఈ కార్యక్రమంలో మండంలోని పలువురు జనసేనా నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కంబదూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త

కంబదూరు మండలం కదిరిదేవరపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మండపాన్ని ఏర్పాటు చేసి కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణుని వేషధారణలో చిన్నారి

శెట్టూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త

కృష్ణాష్టమి పండుగను జరుపుకున్నారు ప్రజలు, తమపిల్లలను శ్రీకృష్ణుడి వేషధారణ, గోపిక వేషధారణల్లో అలంకరించారు. అదే విధంగా పాఠశాలల్లో సైతం చిన్నారులు వివిధ వేషధారణల్లో వచ్చి కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. మరికొన్ని పాఠశాలలో శ్రీకృష్ణుడు ఉట్టికొట్టే కార్యక్రం నిర్వహిస్తుంటే, గోపికలు ఉట్టిని లాగే కార్యక్రమాన్ని అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా ఆయన విశిష్టతను తెలియజేశారు.

## భక్తి శ్రద్దలతో కృష్ణాష్టమి వేడుకలు

తాడిమర్రి, ఆగస్టు 26 ప్రభాతవార్త


కృష్ణుని వేషధారణలో చిన్నారి

తాడిమర్రి మండలంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమతమ ఇళ్లల్లోనూ, దేవాలయాల్లోనూ విగ్రహాలను, పంచామృతాభిషేకాలు నిర్వహించి పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించి కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్నారులను కృష్ణుని వేషధారణలో గోపిక వేషంలో అలంకరించుకుని ఫోటోలు తీసి ముగ్దులయ్యారు. తమ పిల్లలు శ్రీకృష్ణుని ఆకారంలో ఉండటం చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఆలయానికి తగిన భద్రత కల్పిస్తాం

హిందూపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి ఆలయానికి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ కోరిన విధంగా ఉన్నతాధికారుల సూచనలతో తగిన భద్రత ఏర్పాటు చేస్తామని హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్ హామీ ఇచ్చారు. సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్న సిఐ జనార్ధన్‌ను రామానందన్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.


సిఐని సన్మానిస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యేను కలిసిన ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ మరియు జిల్లా నాయకులు


ఎమ్మెల్యే కాలవను సన్మానిస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం

డి.హీరేహాళ్, ఆగస్టు 26 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గంలో ఉన్న ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్‌లు అందరూ రాయదుర్గం శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రైవేట్ స్కూల్ ఎదుర్కొంటున్న సమస్యలను అపుస్మ(ఆంధ్రప్రదేశ్ ఆన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి మరియు జిల్లా నాయకులు ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్స్ ఎమ్మెల్యేకు వివరించారు. దానికి శాసనసభ్యులు మాట్లాడుతూ తమ పరిధిలో మీ సమస్యలను పరిష్కారం కావడానికి కావల్సినటువంటి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు.

**రాయదుర్గం తాలుకా నూతన కమిటి ఎంపిక....**

సెయింట్ పాల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం నూతన కమిటిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటిలో రాయదుర్గం గౌరవాధ్యక్షులుగా కవిత(స్టాన్ వ్యాలీ ఇంగ్లీష్‌మీడియం స్కూల్), అధ్యక్షులుగా యం.వన్నూర్‌స్వామి(బాలమేదావి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్, కల్యం), జనరల్ సెక్రెటరీగా కెకె.హెచ్. హతావుల్లా(హతావుల్లా ఇంగ్లీష్‌మీడియం స్కూల్ కణేకల్లు), ట్రెజరర్‌గా సుగుణ జ్యోతి(సెయింట్ పాల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రాయదుర్గం)ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతనంగా జిల్లా బాడీలోకి డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రుక్మిణిని, జాయింట్(వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాయదుర్గం), సెక్రెటరీగా రవికుమార్( శ్రీ విద్యానికేతన్ కణేకల్లు మరియు ఈసీ మెంబర్‌గా మీనా కుమారీ మంరియు రాయదుర్గం అసెంబ్లీకి వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీ రాజగోపాల్, జాయింట్ సెక్రెటరీగా అన్వర్‌బాష, గౌరవ సలహాదారులుగా అయుబ్ ఖాన్ ఎంపిక చేయడం జరిగింది. సమస్యలన్నిటిని కూడా ముందుకు తీసుకొనిపోయి పరిష్కారం చేయడానికి అందరూ కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు పి.కుసుమ పుల్లారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ కరెస్పాండెంట్స్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.సుబ్బారెడ్డి మరియు రాష్రస్త కనీన్వనర్ యం.నాగరాజు, జిల్లా నాయకులు సూర్యనారాయణ, కళ్యాణదుర్గం కొత్తపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జననేత జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి క్రిష్టప్ప

డి.హీరేహాళ్, ఆగస్టు 26 ప్రభాతవార్త

జననేత రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవాసమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో ఆ సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న, కోశాధికారి నాయకుల బండి చంద్రశేఖర్, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, బొమ్మనహాళ్ మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు వన్నప్ప, మిత్రులతో కలిసి కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి రోజు జన్మించిన వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి వేడుకల్లో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులు, కుల, మతాలకతీతంగా ఆయా సామాజిక వర్గాలకు చెందిన మిత్రులు, బంధువులు, అభిమానులతో పాటు పలువురు ఉద్యోగులు ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీనారాయణ హమాలి యూనియన్ సంఘం సభ్యులు బండి జన్మదిన వేడుకల్లో ప్రత్యేకంగా తయూరు చేయించిన కేక్‌ను కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన జన్మదిన వేడుకల్లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఆంజి బృందం, సిపిఐ నాయకులు కొట్రేష్ బృందం, మిత్రుడు టిడిపి ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ బృందం, కర్ణాటక చిత్రదుర్గం జిల్లా డిఎస్ఎస్ అధ్యక్షులు డిఆర్.ఉమేష్ తదితరులు ఈ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని వ్యక్తపరించారు. ఈ కార్యక్రమంలో మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు సిద్దలింగప్ప, తిప్పేస్వామి, హనుమంతు, చంటి యాదవ్, అడిగుప్ప నగేష్, కొండాపురం శీనా, శివ తదితరులు హాజరైయ్యారు.

## వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోండి


పంటలను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

రాయదుర్గం, ఆగస్టు 26 ప్రభాతవార్త

నియోజకవర్గం వ్యాప్తంగా కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను, రైతులను ఆదుకోవాలని సిపిఐ, ఏపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ తాలుకా కార్యవర్గ సభ్యుడు కొట్రేష్, ఏపి రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్షులు నరసింహులు సోమవారం నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు వివిధ రకాల పంటలను వేసి కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటల కోసం బంగారు తాకట్టు పెట్టి అప్పులు చేసి ఈ సారైనా కష్టాలు తీరుతాయని ఆశించిన రైతులకు తీవ్ర నష్టాన్ని చవిచూడడంతో వేళలో పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఏడిఏ లక్ష్మణనాయక్ కూడా ఓ ప్రకటన విడుదల చేస్తూ కేవలం 166ఎకరాలు మాత్రమే వర్షానికి నష్టపోయినట్లు నివేదిక వెల్లడించారని, నియోజకవర్గం వ్యాప్తంగా ఏడిఏ పరిశీన చేపడితే వేళ ఎకరాలు పంటలు నష్టపోయిన సందర్భంరాలు ఉన్నాయని, ఇవన్నీ తెలియకుండా ముందస్తుగా ఇలా ప్రకటన ఇవ్వడం సరైన పద్దతి కాదని వారు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాల్సింది పోయి ప్రకటనలతో రైతుల మీద ఆశలు చెలకండి అని, పూర్తిగా సమగ్రంగా ఈ క్రాప్ కూడా నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలియజేశారు. రాయదుర్గం మండల వ్యాప్తంగా కాశీపురం, కెంచానపల్లి, బొమ్మక్కపల్లి, మల్లాపురం, కదరంపల్లి, మొలకాపురం గ్రామాల్లో రైతులు పండించిన పంటలను మార్కెట్లోకి తీసుకెళ్లితే తిరిగి వెన్నకు పంపించడం జరిగిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన పంటలకు సమగ్రవిచారణ చేపట్టి నష్టపోయిన రైతులకు పూర్తిగా నష్టపరిహారం అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలలో సిపిఐ మండల కార్యదర్శి దుర్గన్న, సిపిఐ నాయకులు కుమార్, ఆంజి, దివాకర్, సురేష్, పంటల రైతులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఏ హయాంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ బలోపేతం

- జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ మణికంఠ


జనసేన నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

గత వైకాపా ప్రభుత్వ హయాంలో బలహీనంగా మారిన గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎన్‌డిఏ ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ వాసగిరి మణికంఠ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ చొరవతో రాష్ట్రం వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధికై 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. 87 రకాల పనులు గుర్తించి 4,500 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సర్పంచుకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలను భాగస్వాములను చేయడం ఎన్‌డిఏ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తద్వారా గ్రామ స్వరాజ్యపాలన సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ, గ్రామీణ కన్వీనర్లు పాటిల్ సురేష్‌రాయల్, చిన్నవెంకటేశులు, నాయకులు బోయగడ్డ బ్రహ్మయ్య, వెంకటపతి, ఓబులేసు, గోరంట్ల నాగయ్యరాయల్, మురళి, ధనుంజయ, హుసేన్, కార్తీక్, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

## యుపిఎస్ పెన్షన్ విధానంపై రైల్వే కార్మికులు సంబరాలు


రైల్వే కార్మికులు సంబరాలు చేస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం రద్దు చేసి యుపిఎస్ పెన్షన్ విధానాన్ని అమలులోకి తేవడం పట్ల సోమవారం రైల్వే కార్మికులు సంబరాలు చేసుకున్నారు. దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో హెడ్‌క్వార్టర్స్ బ్రాంచ్, ఓపెన్‌బ్రాంచ్, డీజిల్‌షెడ్ బ్రాంచ్‌లో కార్మికులు టీ విరామ సమయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మనోహర్‌బాబు, కార్యదర్శి మనోహర్, అక్తర్, విష్ణుప్రియ, శ్రీదేవి, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

గుత్తి, గుత్తిఆర్ఎస్, గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం, కొత్తపేట శివారులోని శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. చర్చిరోడ్డులోని ప్రభోదానందసేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6 అడుగుల శ్రీకృష్ణుని విగ్రహం అందరిని అలరించింది. పది రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## గుత్తిలో చోరీ


చోరీ జరిగిన దృశ్యం

గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త

పట్టణంలోని తాడిపత్రిరోడ్డులో వున్న సమ్రీన్ స్టీల్స్, సిమెంట్ దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని అగంతుకులు పైన రేకులు కోసి షాపులోకి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌లో వున్న దాదాపు 15 వేల రూపాయల నగదు అపహరించినట్లు బాధితుడు జమీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నబీరసూల్ పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త


వ్యక్తి మృతి చెందిన దృశ్యం

గుత్తి జిఆర్‌పి పరిధిలో గుత్తి – పెండేకల్లు నడుమ పగిడి రాయి సమీపంలో సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీ కొని పాపన్న (53) అనే వ్యక్తి మృతి చెందాడు. జొన్నగిరి గ్రామానికి చెందిన ఇతను రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

- శ్రావణ చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త

పట్టణంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ నామ సంవత్సరం శ్రావణ చివరి సోమవారం సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వల్లకీ సేవ నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పూజలు, అర్చనలు చేయించారు. ఆలయ కమిటీ వారికి తీర్థ ప్రసాదాలను అందించింది.


ప్రత్యేకాలంకరణలో మల్లేశ్వరస్వామి మూలవిరాట్

## జిల్లాస్థాయి యోగ పోటీల్లో ఉరవకొండ విద్యార్థుల ప్రతిభ

-ట్రెడిషనల్ జూనియర్ బాలికలు, ఆర్టిస్ట్ యోగ గ్రూప్ విభాగాల్లో ప్రథమ స్థానం


ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి అందుకొంటున్న విద్యార్థిని భరణి


బహుమతులు అందుకొంటున్న హర్షవర్ధన్, యువరాజు, మణికంఠ, విఘ్నేశ్వర, హేమ సాత్విక్

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త

అనంతపురంలోని యోగ భారత్ ఆధ్వర్యంలో వివేకానంద కేంద్రాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి యోగ పోటీల్లో ఉరవకొండకు చెందిన, నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత విద్యా, వికాస శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రెడిషనల్ జూనియర్ బాలికలు, ఆర్టిస్ట్ యోగ గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారని యోగ మాస్టర్, నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వెంకట్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భరణి అనే విద్యార్థిని ట్రెడిషనల్ జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలువగా, చిన్నముష్టూరు గ్రామంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు హర్షవర్ధన్, యువరాజు, ఉరవకొండలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన మణికంఠ, విఘ్నేశ్వర, వివేకానంద పాఠశాలకు చెందిన హేమసాత్విక్ ఆర్టిస్ట్ యోగ గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అనంతపురంలోని ఆదివారం రాత్రి జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. ఈ విద్యార్థులందరూ సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

## వైభవంగా కొనకొండ్ల విరక్తిమఠం పీఠాధిపతి మహాలింగస్వామి పట్టాభిషేక మహోత్సవం

-హాజరైన గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్రస్వామి తదితరులు


పీఠాధిపతి మహాలింగస్వామి వారి పట్టాభిషేక మహోత్సవం దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని విరక్తి మఠం నూతన పీఠాధిపతి పూజ్య మ॥ ని॥ ప్ర॥ మహాలింగస్వామి పట్టాభిషేక మహోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ అష్టమి సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డా॥కరిబసవరాజేంద్ర స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం బ్రహ్మి ముహూర్తంలో మఠంలోని తొలి పీఠాధిపతి సిద్దేశ్వరస్వామి, ఇతర పీఠాధిపతుల సమాధులకు మహారుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. షట్స్థల ధ్వజారోహణ మహోత్సవం అనంతరం మహాలింగస్వామిను పీఠాధిపతిగా పట్టాభిషేకం నిర్వహించి మఠం నిర్వహణ బాధ్యతలను అప్పగించి వేద ఆశీర్వాదం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన పీఠాధిపతి మహాలింగస్వామి మాట్లాడుతూ సిద్దేశ్వరస్వామి, ఇతర పీఠాధిపతుల ఆశీస్సులతో మఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మఠం భక్తులతోపాటు అడవి అమరేశ్వర శ్రీక్షేత్రం శాంతమల్ల మహాస్వామి, హాల్వి చరణగిరి సంస్థాన మఠం అభినవ మహాంత మహాస్వామి, బళ్లారి కళ్యాణిస్వామి మఠం కళ్యాణ మహాస్వామి, షాపూర్ పక్కిరేశ్వర మఠం గురుపాద మహాస్వామి, చిత్తపుర్ కంభాళేశ్వర మఠం సోమశేఖర శివాచార్య మహాస్వామి, జంగమర హోసహళ్ళి పురవర్గం మఠం అజాత శంభులింగస్వామి, బళనగూరు మరిశివయోగి మఠం సిద్దబసవ మహాస్వామి, చికలపరివి రుద్రమునీశ్వర మఠం సదాశివ మహాస్వామి, ఆదవాని మండిగిరి మఠం గురుసిద్ధ మహాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరుగు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

-చెత్తాచెదారం తొలగించి, మురుగు కాలువల శుభ్రం

-వర్షపునీరు నిల్చున్నచోట ఆయిల్ బాల్స్, రాత్రిపూట ఫాగింగ్


చెత్తచెదారం శుభ్రంచేసి పొడి సున్నం చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికుడు


పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు, దోమల నివారణకు మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇటీవలి కాలంలో వర్షాలు కురవడంతో దోమల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి కేంద్రీకరించి ప్రధాన రహదారిలోని డివైడర్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తచెదారం, మట్టి కుప్పలను పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు ఇతరత్రా ప్రదేశాల్లోని చెత్త దిబ్బలను తొలగించి మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. వర్షపునీరు నిల్వవున్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించి మిలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. దోమల నివారణకై సాయంత్రం మొదలు రాత్రి వరకు పలు వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకొంటున్నామని అన్నారు.

## ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తా

**- లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రామానందన్‌స్వామి**



రామానందన్‌స్వామిని సత్కరిస్తున్న దృశ్యం

**హిందూపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త**

హిందూపురం ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రామానందన్ స్వామి అన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం రామానందన్ స్వామి ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణం జరిగిందని అప్పటి నుండి ఎటువంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో పెచ్చులూడిపోవడం జరుగుతోందని తెలిపారు. దీంతో ఎంపికైన నూతన కమిటీ దాతల సహకారంతో ప్రెస్‌క్లబ్ ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిం దన్నారు. తమవంతు సహకారాలు అందించాలని రామానందన్‌స్వామిని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ప్రెస్‌క్లబ్ భవనానికి అవసరమైన పెయింటింగ్ మొత్తం తానే చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన పాత్రికేయులు రామానందన్ స్వామిని ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. అనంతరం పర్యావరణవేత్త భాస్కర్‌రెడ్డి అందించిన మహాగని మొక్కలను ప్రెస్‌క్లబ్ ఆవరణలో నాటారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు రాంప్రసాద్, జె.ప్రకాష్, ప్రధానకార్యదర్శి ప్రశాంత్,కోశాధికారి ఫణి,షబ్బీర్,ప్రకాష్,రాజేష్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

**అమరాపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త**



గంగాపూజ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలలు సోమవారంనఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం గణపతిపూజ, గంగాపూజ, వేణుగోపాలస్వామికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామ సమీపంలోని వంకలో గంగాస్నానాన్ని ఆచరించారు. అదేవిధంగా 27వతేదీ మంగళవారం స్వామివారి కళ్యాణోత్సవం, ఉయ్యాలసేవ, 28న బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో యాదవ సంఘం అధ్యక్షులు బికె లింగన్న, వెలుగు దేవరాజ్, పిసి చిక్కన్న, నరసింహమూర్తి, బిసి దేవరాజు, గౌడనకుంట మంజునాథ్, టెంపో నాగరాజు, అర్చకులు నరేష్, రాజప్ప, కాటప్ప, పెద్దసంఖ్యలో మహిళలు, యాదవ సంఘం యువనాయకులు శివరాజ్‌యాదవ్, ఉతేష్, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు. అలాగే తమ్మడేపల్లి, వలస, మద్దనకుంట, చిట్టనడుకు, కెంకెర, శివరం గొల్లహట్టి, తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**చిలమత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త**



శ్రీకృష్ణునికి పూజలు నిర్వహించిన దృశ్యం

చిలమత్తూరు మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన శ్రీకృష్ణుని ఆలయంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకణ చేసి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మెయిన్ బజార్‌మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం హాజరైన వారికి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలతో అందరిని అలరించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**- వేడుకల్లో పాల్గొన్న జడ్పిటిసి, సర్పంచు**

**అగళి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మహిళలు హారతులను స్వామికి తీసుకెళ్తున్న దృశ్యం

మండల పరిధిలోని పూలవల్లి గ్రామంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో అలంకరించారు. ముఖ్యంగా మహిళా భక్తులు శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని హారతులను పట్టారు. విగ్రహం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలను చేశారు. శ్రీకృష్ణుడు చిన్న తనంలో చేసిన చేష్టలను గురించి మాట్లాడుకున్నారు. శ్రీకృష్ణాష్టమి రోజు పూజల్లో పాల్గొంటే అన్ని మంచే జరుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ పూజా కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, సర్పంచు నరసింహమూర్తి, మాజీ ఎంపిటిసి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. మహామంగళ హారతి అనంతరం ప్రసాద వితరణ చేశారు.

## మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**గుడిబండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాసమూర్తి

గుడిబండ మండల పరిధి లోని జమ్మలబండ, కదుపు లయ్య పాళ్యం, సింగేపల్లి, తిమ్మళాపురం, పి.గొల్లహట్టి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి జన్మాష్టమి వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణుని విగ్రహానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు రాఖీ కట్టి జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రజలను అలరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జమ్మలబండ మాజీ సర్పంచు శ్రీనాథ్, బూదిపల్లి జయరామప్ప, లాయర్ శివకుమార్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, లాయర్ గోవిందప్ప, మాజీ ఎంపిటిసిలు భోజరాజు, వెంకటేష్, సన్నమారప్ప, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు జవనదుకు రంగా తదితర మండల ప్రజలు పాల్గొన్నారు.

## భక్తుల నోట..గోకుల కృష్ణ గోపాల కృష్ణమాట

**- గోరంట్లలోని మాధవరాయుని ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు**

**-పట్టణంలో ఉత్సవ విగ్రహం ఊరేగింపు..పాల్గొన్న భక్తాదులు**





చిన్నికృష్ణుని వేషదారణలో చిన్నారులు

◄ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

**గోరంట్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

పవిత్రమైన శ్రీకృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని గోరంట్ల పట్టణ నడిబొడ్డున వున్న అతి పురాతన మాధవరాయుని ఆలయం ప్రాంగణంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. వేదపండితులు మేఘనాథ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వేదవ్యాస్‌తో పాటు గ్రామ పెద్దలు, మాజీ సర్పంచు నిమ్మల చంద్రశేఖర్, నిమ్మల శ్రీధర్, మెస్రి వెంకటరామప్ప, పులేరు హరి, తదితరుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా మాధవరాయుని ఆలయం ప్రాంగణంలో సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో జరిగిన వేడుకలను సాంప్రదాయబద్ధంగా గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పట్టణ పురప్రజలు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా గోమాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పట్టణంలోని నారాయణ స్కూల్ విద్యార్థులు చిన్నికృష్ణుని వేషదారణలో అందరిని ఆకర్షించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలన్న, ఆటపాటలతో కళాకారులు అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మురికి కూపంగా కసాపురం

**- వైద్య శిభిరం ఏర్పాటు**

**అగళి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



తాగునీటి ట్యాంకు వద్ద మురికిమయంగా ఉన్న దృశ్యం

మండల పరిధిలోని కసాపురం గ్రామం విష జ్వరాలతో తల్లడిల్లుతోంది. దాదాపు 15 మంది జ్వరాల భారిన పడ్డారు. వీరు వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం శిర ఆసుపత్రికి కూడా వెళ్లినట్లు ఆ గ్రామం ఉపసర్పంచు శివన్న తెలిపారు. గ్రామం మురికి మయంగా మారింది. తాగునీటి ట్యాంకు వద్ద మురికి నీరు నిల్చుని ఉంది, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దాదాపు 50-60 శాతం గ్రామం మురికి మయంగా ఉందని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోయిన మురికిలో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి భారిన పడిన ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన డాక్టర్ శివానంద, తన సిబ్బంది లక్ష్మీదేవి, మంజుళ, ఎఎన్ఎంలతో కలిసి వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందజేశారు. మూడు నాలుగు రోజులుగా జ్వరాలు సోకడంతో కొందరికి ఎంతకీ తగ్గకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కార్యదర్శిలు చొరవ తీసుకుని మురికి కాలువలను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉచిత గుండె వైద్య శిభిరానికి అనూహ్య స్పందన

**రామగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



గుండె పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మండల కేంద్రమైన రామగిరిలో షిర్డిసాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో అనంతపురం లోని కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకా రంతో సోమవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిభిరానికి అనూహ్య స్పందన వచ్చింది. దాదాపు 100 మందికి పైగా గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను వైద్యులు పరీక్షించి అందులో నలుగురు మెరుగైన వైద్యం కోసం అనంతపురంకు సవేరా ఆసుపత్రికి తరలించారు. వచ్చిన వారికి వైద్య సేవలు అందించి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణ, ఆసుపత్రి సిబ్బంది, షిర్డిసాయిబాబా కరస్పాండెంట్ ముత్యాల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**రామగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దకొండాపురం గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గ్రామంలోని యాదవ సోదరులందరూ శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేశారు. శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం శ్రీకృష్ణుని చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు.

**పురం ఎంపి పార్థసారధిని సన్మానించిన**

## ఏఎన్‌కె కళాశాల యాజమాన్యం



ఎంపి పార్థసారధికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**గోరంట్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధిని కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు గోరంట్ల పట్టణంలోని ఏఎన్‌కె కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మినారాయణ బృందం. ఈ సందర్భంగా సోమవారం ఎంపి పార్థసారధిని నివాసంలో ఆయన్ను ఏఎన్‌కె డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మినారాయణ, ఎస్‌పిఎస్ జూనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపి పార్థసారధిని పూలమాలలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడులు

**- 12 మంది అరెస్ట్ - రూ.73,370 స్వాధీనం**

**గోరంట్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

గోరంట్ల మండలం కరావలపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 73,370 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు. కరావలపల్లి గ్రామ శివారులో పెద్దఎత్తున పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## చేనేత పరిశ్రమలో రాబంధుల భరత పడతాం

**- చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు**

**- ముఖ్యమంత్రి హ్యాండ్లూమ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం..**

**- అక్రమార్కులకు అండగా నిలుస్తున్నా అధికారులను ఉపేక్షించం**



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు

**ధర్మవరం, ఆగస్టు 26 ప్రభాతవార్త**

చేనేత పరిశ్రమను కాపాడాల్సిన ఆ నేతన్నలే అక్రమార్గంలో పయనిస్తూ వాటిని నిర్వీర్యం చేస్తున్న వారి భరతం పడతామని సిపిఐ నియోజకవర్గ కార్య దర్శి ముసుగుమధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణలు పేర్కొన్నారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చేనేత బిడ్డను అని చెప్పుకునే జింకా రామాంజినేయులు, ఆ పరిశ్రమపై ప్రేమ ఉంటే హ్యాండ్లూమ్స్ మగ్గాలు ఏర్పాటు చేసి ఎందరికో శాశ్వతంగా జీవనోపాదిని కల్పించవచ్చన్నారు. అలా కాకుండా అత్యంత టెక్నాలజీగల పవర్లూమ్స్ మగ్గాలను ఏర్పాటు చేసుకుని విచ్చల విడిగా ఉత్తర్వులు నిర్వహిస్తూ తోటి నేతన్నల కడుపు కొడుతున్నా రన్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ఇప్పటికే చితికిపోయిన పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. తోటి చేనేత బిడ్డనని చెప్పుకునే రామాంజినేయులు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను పిలిపించుకుని పనులు చేయించుకోవడానికి వారికి సిగ్గు అనిపించలేదా..? అని వారు ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలు అరికట్టడానికి తిరుపతిలో ఉన్న ఎన్‌ఫోర్స్ మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను ఆహ్వానించి, జింకా రామాంజినేయులు అక్రమాలపై ఆయన నిర్వహిస్తున్న చేనేత ప్రాజెక్టు వద్ద ధర్నాకు సిద్దం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర ఇశ రమణ, చేనేత కార్మిక సంఘం కార్యవర్గ సభ్యులు ఆదినారా యణ, శ్రీధర్, శ్రీనివాసులు బాల రంగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కృషి చేస్తాం



స్తంభాలను ఏర్పాటుకు సిద్దం చేస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త**

మండల పరిధజలోని రావులచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలమవడంతో కాలనీ వాసులు ఇళ్ల మీద కర్రలతో, చెట్ల మీద విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. దీని వల్ల ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతోందన్న భయాందోళనలతో మొన్నటి మంత్రి పర్యటనలో కాలనీ వాసులు మంత్రికు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి సిబ్బంది హరీష్, మల్లికార్జునకి తెలియజేయడంతో వారు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆ గ్రామానికి వెళ్లారు. అక్కడి సమస్యను పరిశీలించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు అంచనా ఎంత అవుతుందో చెప్పాలని, విద్యుత్ శాఖాధికారులకు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని వారు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వక్కలిగల మధ్య కులరాజకీయాలు చేయకండి

**- వక్కలిగల శ్రేయోభిలాషి గుండుమల**



మాట్లాడుతున్న వక్కలిగ కులబాంధవులు

**మడకశిర ఆగస్టు 26 ప్రభాతవార్త**

కొంతమంది వక్కలిగలు కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ వక్కలిగల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని సోమవారం బాలాజి నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తేదేపా వక్కలిగ కులబాంధవులు విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సొంత పార్టీల కోసం గత రెండు రోజుల క్రితం నుండి కొంత మంది వక్కలిగలు ఒక వ్యక్తిపై దాడి చేశారని ఆరోపిస్తూ కులరాజకీయాలు చేస్తూ గుండుమల తిప్పేస్వామి తమ్ముడిపై అభాండాలు వేస్తున్నారని అన్నారు. గుడిబండ మండలానికి చెందిన కరుణాకర్ అనే వ్యక్తి గుండుమల తిప్పేస్వామిపై సోషియల్ మీడియా ఫేస్‌బుక్‌ల ద్వారా వ్యక్తి గత దూషణలు వేశాడని వారు ఆరోపించారు. గుండుమల తిప్పేస్వామి మడకశిర నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని అలాంటి వ్యక్తిపై ఒక వక్కలిగ కులానికి చెందిన వ్యక్తి దూషిచండాన్ని తామంతా ఖండిస్తున్నామని వారు అన్నారు. సోషియల్ మీడియాలో తమ నేతపై దూషించడంతో ఈ వివాదం తలెత్తిందని అన్నారు. గుండుమల తిప్పేస్వామి వక్కలిగల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు తమ శ్రేయోభిలాషి అని అన్నారు. కొంతమంది వైకాపా నాయకులు ఈ విషయాన్ని మాకు తెలియకుండా మీరు మాత్రమే చర్చించి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం ఒక వ్యకికి సంబంధించినది మాత్రమే కానీ కుంచటిగ సామాజిక వర్గానికి చెందినది కాదని గుర్తుంచుకోవాలని ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు. గతంలో ఇలాంటివి ఎన్నో జరగాయని వాటిని పట్టించుకోలేదని కానీ ఇప్పుడు కేవలం ఒక వ్యక్తి అనవసర దూషణలను కొంతమంది కులరాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. అందరూ కలిసి వక్కలిగ సంఘంను అభివృద్ధి చేసుకొందామని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ సంఘం డైరెక్టర్లు ఎస్.లక్ష్మీనారాయణ, అశోక్ మరియు సంఘం నాయకులు శ్రీనివాస్, శివకుమార్, విశ్వనాథ్, మంజునాథ్, కుమార్‌స్వామి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ద రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**ధర్మవరం రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త**



పట్టణంలోని చెరువు కట్ట మీద గల సిద్దరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేది నుంచి 24వ తేది వరకు సప్తహని వేడుకలు భజన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు రాఘవ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నిర్వహించారు. అనంతరం భజన కమిటీ అధ్యక్షులు యంబ లింగన్న, కార్యదర్శి ఈశ్వరయ్య, కోశాధికారి కుళ్లాయప్ప, సభ్యులు మణిదీప్, నాగప్పలు మాట్లాడుతూ.. ఏడు రోజులపాటు రాత్రి పగలు ఆరు చెక్క భజనలు బృందంతో 24 గంటలపాటు భజన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం వర్షాలు అధికంగా కురవాలని, రైతుల పంటలు అధిక దిగుబడికి రావాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఉద్దేశంతోనే ఈ సప్తహమి వేడుకలను నిర్వహించామని తెలిపారు. ఆలయ కమిటీ, దాతల సహాయ సహకారాలతో విజయవంతం కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తదుపరి ఈ వేడుకల్లో బిజెపి జాతీయ నాయకులు అంబటి సతీష్‌కుమార్, పెనుబోలు విజయ్‌కుమార్, కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


**- గోవింద నామస్మరణతో బ్రహ్మరథోత్సవం**



రథోత్సవం దృశ్యం



ప్రత్యేక అలంకరణలో శ్రీవారి మూలవిరాట్



ఇస్కాన్ నేతృత్వంలో

**హిందూపురం టౌన్, ఆగస్టు 26 ప్రభాతవార్త**

జగద్గురు శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు హిందూపురంలో అంగరంగవైభవంగా జరిగాయి. స్థానిక చిన్నమార్కెట్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేశారు. అనంతరం గోవింద నామస్మరణం మధ్య బ్రహ్మ రథోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ విద్యాసాగర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జెపికె రాము, టిడిపి కౌన్సిల్ విపక్షనేత రమేష్‌కుమార్, కౌన్సిలర్ నాగేంద్రకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు, దేవాదాయశాఖ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కాగా శ్రీవాసవి ధర్మశాలలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శోభాయమానంగా జరిగాయి. విశేష కార్యక్రమాలు ఉదయం నుండి రాత్రి వరకు కొనసాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

**ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో**

## ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు





శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని చెన్నేకొత్తపల్లి న్యామద్దెలకు వెళ్లే, ప్రధాన కూడలిలో పక్కన ఖాళీ ప్రదేశంలో సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన వేదికలో సోమవారం శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలలో పలువురు ప్రబోధ సేవా సమితి సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు చిన్నారులు, శ్రీకృష్ణుని వేషధారణలో గ్రామ ప్రజలను ఆకట్టుకున్నారు. సాయంత్రం ప్రబోధ సేవా సమితి వక్తలు ఉపన్యసించారు. ప్రబోధ సేవ సమితి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలలో రెండవ రోజైన మంగళవారం ప్రబోధసేవా సమితి శ్రీకృష్ణుని వేదిక ముందు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మూడవ రోజు అయిన బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీకృష్ణుని పుర వీధుల గుండా ఊరేగింపు గావిస్తారు ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మహిళలు, యువకులు కోలాటం చేస్తూ పాటలు పాడుతూ ఊరేగింపుగా వెళ్లడం జరుగుతుంది. మూడు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలను తరలివస్తారని, సేవా సమితి సభ్యులు తెలియజేశారు.

## సత్యసాయి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

**తాడిమర్రి, ఆగస్టు 26 ప్రభాతవార్త**




సమ్మెలో పాల్గొన్న సత్యసాయి కార్మికులు

గత 25 సంవత్సరాలుగా వేలాది గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా నిరంతరం పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులు డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా తాడిమర్రిలోని పంప్ హౌస్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే., కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. సత్యసాయి బాబా కరువు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. 25 సంవత్సరాలుగా బడ్జెట్‌ను అంతంత మాత్రంగా ఇస్తూ ప్రస్తుతం నెలకు 80 లక్షలు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. 1996 నుంచి 2020 వరకు 2.40 కోట్లు ఉన్న బడ్జెట్‌ను 80 లక్షలకు కుదించడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో ఈ పథకాన్ని అమలు చేసే బాధ్యత కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, తక్కువ మొత్తం కావడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారన్నారు. దీంతో తమకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఓబులేసు, సతేష్, తిరుపాల్, నాగార్జున, రామ్మోహన్‌రెడ్డి తదితర కార్మికులు పాల్గొన్నారు. తమ సమస్యను జిల్లా కలెక్టర్‌లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు కోరారు.

## పట్టుచీరల వ్యాపారవేత్త మృతి

**హిందూపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త**



పల్లా లక్ష్మినారాయణ (ఫైల్‌ఫోటో)

హిందూపురం పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పట్టుచీరల వ్యాపారిగా పేరొందిన పల్లా లక్ష్మినారాయణ (73) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ముదిరెడ్డిపల్లిలో తన నివాసంలో మృతి చెందారు. పట్టుచీరల ఉత్పత్తి రంగంలో నూతన ఒరవడి సృష్టించిన పల్లా లక్ష్మినారాయణ మృతి తీరనిలోటని తెలుగుదేశం పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిల్ విపక్ష నేత డివి రమేష్‌కుమార్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా గతంలో హిందూపురం అసెంబ్లీ స్థానానికి ప్రజారాజ్యం తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు.

**CHANGE OF NAME**

I, P.MANOJ S/O P.GOPAL REDDY, residence of D.No. 8/232, MUDINDLA PALLI, PARIGI MANDAL, SRI SATHYA SAI District), Changing my mother name from P.SHYAMALA(OLD NAME) to **PEDDAIAH GARI SHYAMALA** (NEW NAME) ADHAAR CARD No. 9235 9102 1535,Hence forth my mother name being called as **PEDDAIAH GARI SHYAMALA** for all purposess

**CHANGE OF NAME**

I, P.MANOJ S/O P.GOPAL REDDY, residence of D.No. 8/232, MUDINDLA PALLI, PARIGI MANDAL, SRI SATHYA SAI District), A.P . Changing my father name from P.GOPAL REDDY (OLD NAME) to **PEDDAIAH GARI GOPAL REDDY** (NEW NAME) ADHAAR CARD No.4666 5388 1286.Hence forth my father name called as **PEDDAIAH GARI GOPAL REDDY** for all purposes.

